క్లుప్తంగా

కవితకు చీర, సారె



జనగామ: జనగామ జిల్లా కేంద్రంలో జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ సమావేశంతో పాటు ఓ ప్రైవేటు కార్యక్రమానికి వచ్చిన తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు నాయకులు అనంతల ఆంజనేయులు గురువారం చీర,సారె, పండ్లతో గౌరవించారు. ఆడపడుచుగా గౌరవిస్తూ మన సంస్కృతి, సాంప్రదాయాలను చాటిచెబుతూ చేపట్టిన ఈ కార్యక్రమంతో కవిత చాలా హ్యాపీగా ఫీలవుతూ ఆంజనేయులును దీవించారు.

అవ్వా.. క్యారెట్ కిలో ఎంత



పాలకుర్తి: అవ్వా.. వ్యాపారం ఎలా ఉంది.. క్యారెట్ ఎంతకు కిలో ఇస్తున్నావ్.. అంటూ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి గురువారం మండలంలోని చెన్నూరు గ్రామంలో అంగడిలో ఓ చిరు వ్యాపారితో ముచ్చటించారు. రోడ్డు పై ఉన్న అంగడిలో అవసరమైన సదుపాలయాలు కల్పిస్తానని చెప్పారు. ఎమ్మెల్యేతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

విరాళం



బచ్చన్నపేట: మండలంలోని కేసిరెడ్డిపల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి గ్రామ నాయకుడు ఇమ్మడి జితేందర్‌రెడ్డి రూ. 30 వేల విరాళాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌ల ఆరాధ్య దైవమైన పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు విరాళం అందజేశానని , దాతలు కూడా సహకరించాలని కోరారు. కాపర్తి హరిప్రసాద్, నీల మధు, బాపిరాజు, ఆంజనేయులు, నర్సింహులు పాల్గొన్నారు.

స్నేహితుల చేయూత



చిల్పూరు: మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన రేషన్ డీలర్ దాసరి సుగుణ 10 రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న 1989–90 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన స్నేహితులు పానుగంటి విరాట్ ఆధ్వర్యంలో గురువారం రూ. 23 వేల సాయం కుటుంబ సభ్యులకు అందజేశారు. కుమారస్వామి, ప్రకాశ్, రాజు, రాజశేఖర్, గోవర్ధన్, వైకుంఠం, కుంటశ్రీను పాల్గొన్నారు.

'స్థానికం'లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- మార్కెట్ కమిటీ చైర్మన్ శివరాజ్



జనగామ రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ అన్నారు. గురువారం మండల అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి అధ్యక్షతన జిల్లా కేంద్రంలో ముఖ్య కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులనే అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. శ్రీనివాస్‌రెడ్డి, మహిందార్, నిమత్తి మహేందర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, శివరాత్రి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చేతి పంపు ప్రారంభం

చిల్పూరు: వేసవిలో తాగునీటికి ఇబ్బంది తలెత్తకుండా బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేతిపంపును ఏర్పాటుచేయడం జరిగిందని సంస్థ ప్రతినిధి ప్రశాంత్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం బాలవికాస ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చేతిపంపును చిల్పూరు ఆలయ ధర్మకర్త గనగోని రమేశ్ ప్రారంభించారు. వెంకన్న, సోమ రవికుమార్, రాజశేఖర్, లింగయ్య, సాజిత్ పాల్గొన్నారు.

సన్మానం

జనగామ రూరల్: జనగామ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ కేడెట్లు ఢిల్లీలో కర్తవ్యపత్‌లో పాల్గొని ఉత్తమ ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా అధ్యాపకులు గురువారం కళాశాలలో వారిని అభినందించి సన్మానించారు. ఇటీవల ఢిల్లీ ఆర్‌డీసీ పరేడ్‌కు వరంగల్ 10టి బెటాలియన్ నుంచి ఆరుగురు విద్యార్థులు ఎన్నికవగా, అందులో జనగామ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన శ్రీకాంత్, అజయ్ ఉన్నారని అధ్యాపకులు తెలిపారు.

బాధ్యతలు ఎవరికి..?

- నేటితో సొసైటీల పాలకమండలి గడువు పూర్తి
- స్పెషలాఫీసర్‌కు అప్పగిస్తారా.. గడువు పెంచుతారా..?
- ఇప్పట్లో ఎన్నికలు లేవనే అంచనా..
- 14 సొసైటీల్లో 1.03లక్షల మంది రైతులు

జనగామ: ప్రభుత్వానికి అనుసంధాన కర్తగా.. రైతులకు సేవలందిస్తున్న ప్రాథమిక సహ కార సొసైటీ (పీఏసీఎస్)ల పాలక మండలి గడువు నేటి(శుక్రవారం)తో ముగియనుంది. గత ప్రభుత్వ హయాంలో అధికార పీఠమెక్కిన చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు ఐదేళ్లపాటు పని చేసి ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి 12 గంటల నుంచి మాజీలు కాబోతున్నారు. మరో ఆరు నెలలు.. లేదా ఎలక్షన్ నిర్వహించే వరకు తమ పదవీ కాలాన్ని పొడగించాలని సొసైటీల చైర్మన్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వీరి అభ్యర్థనను పరిగణలోకి తీసుకుంటారా.. లేదా స్పెషలాఫీసర్లకు బాధ్యతలు అప్పగిస్తారా.. వేచి చూడాలి.

పెద్దమొత్తంలో ఖర్చు..

ప్రాథమిక సహకార సొసైటీ ఎలక్షన్లు.. చేతులెత్తే పద్ధతి ద్వారా చైర్మన్లు, డైరెక్టర్లుగా నియమితులయ్యే పరిస్థితి నుంచి అసెంబ్లీ ఎన్నికల్లా రక్తి కట్టించే విధంగా మారిపోయింది. డైరెక్టర్‌గా గెలుపొందాలంటే సుమారు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలు.. ఆ తర్వాత చైర్మన్ సీటు దక్కించుకోవాలంటే అంతకు రెట్టింపు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. ఈ అంకెలు మచ్చుకు చెప్పుకోవడమే.. కొన్ని చోట్ల చైర్మన్ కావాలంటే రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలు దాటాయని ప్రచారం. డైరెక్టర్ పరిధిలో 50 ఓట్లు లేకున్నా.. ఇరవై రోజుల ముందు నుంచి ప్రచారం.. ఎలక్షన్ రోజు హడావిడి.. ఫలితాల తర్వాత క్యాంపు రాజకీయాలతో సహకార ఎలక్షన్లను వేడెక్కించారు.

ఆరోపణలు.. అక్రమాలు

జిల్లాలో ఐదేళ్ల సొసైటీల పాలనలో అనేక పీఏసీఎస్‌ల్లో పాలక మండళ్లు, కార్యదర్శి (సీఈఓ) అవినీతి, అక్రమాలతో ఆరోపణలు ఎదుర్కొన్నారు. పంట రుణ మంజూరులో బినామీ దందా, డబుల్ పేర్లు, ఎరువులు, విత్తనాల అమ్మ కాలు, ధాన్యం కొనుగోళ్లలో గోల్‌మాల్ చేసి లక్షల రూపాయల సొసైటీ సొమ్మును అప్పన్నంగా దోచేశారు. ఆడిట్ లేకుండా ఏళ్ల తరబడి సొసైటీలో జమ చేయాల్సిన నగదును సొంతానికి వాడుకున్నా.. విచారణ పేరిట కాలయాపన చేయడం తప్ప.. రికవరీ చేసిన జాడ కనిపించడం లేదు. కంచనపల్లి, క్లాం, బచ్చన్నపేట, నిడిగొండ తదితర పీఏసీఎస్ సొసైటీలు అనేక సందర్భాల్లో వార్తల్లో నిలిచాయి.

ఇప్పట్లో ఎన్నికలు లేనట్టే..!

జిల్లాలో 14 సొసైటీలు ఉన్నాయి. ఇందులో 12 ప్రాథమిక సహకార(పీఏసీఎస్), 2 ఫార్మర్ కో ఆపరేటివ్(ఎఫ్ఎస్‌సీఎస్) సొసైటీలు. పీఏసీఎస్‌ల్లో 1,03,630 మంది రైతులు సభ్యత్వం కలిగి ఉన్నారు. 2020 ఫిబ్రవరి 15వ తేదీన సహకార సొసైటీ ఎన్నికలు జరగ్గా 2025 ఫిబ్రవరి 14తో పదవీ కాలం పూర్తికానుంది. కాగా బీసీ రిజర్వేషన్ల అమలు.. ఇంటర్, టెన్త్ వార్షిక పరీక్షల నేపథ్యంలో పంచాయతీ, పరిషత్ ఎన్నికలను జూన్ వరకు వాయిదా వేసిన ప్రభుత్వం.. పీఏసీఎస్ ఎన్నికలను ఇప్పట్లో పట్టించునే పరిస్థితి కనిపించడం లేదు. ప్రస్తుత పదవీ కాలం ముగిసిన తర్వాత ఆరు నెలలు లేదా.. ఎన్నికలు జరిగే వరకు గడువు పొడగిస్తారా.. లేక స్పెషల్ ఆఫీసర్లకు అప్పగిస్తారా.. అనే విషయంలో క్లారిటీ రావాల్సి ఉంది.



పీఏసీఎస్ భవనం

పొడిగిస్తే మరిన్ని సేవలు



పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. పాలక మండళ్లు దిగిపోయిన వెంటనే ఎలక్షన్లు నిర్వహించని సమయంలో పాలన కుంటుబడిపోతుంది. ఎన్నికలను నిర్వహించే వరకు పదవీ కాలాన్ని పొడగించాలి. మా హయాంలో పీఏసీఎస్ స్థలాలను అక్రమణకు గురి కాకుండా కాపాడాం. కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు వెంటనే డబ్బులు అందేలా చర్యలు తీసుకున్నాం.

\- చిర్ర నాగరాజుగౌడ్,
పీఏసీఎస్ చైర్మన్, పల్లగుట్ట

ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్ణయం



ఈ నెల14వ తేదీతో ప్రస్తుత పీఏసీఎస్ పాలక మండళ్ల పదవీ కాలం ముగుస్తుంది. స్పెషల్ ఆఫీసర్ పాలన ఉంటుందా.. లేక వీరి పదవీ కాలం పొడగిస్తారా.. అనే విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటాం.

\- రాజేందర్‌రెడ్డి,
జిల్లా సహకార అధికారి

ఎన్నికలు నిర్వహించాలి



సహకార సంఘాల పాలక మండళ్ల పదవీ కాలం ముగిసిన వెంటనే ఎన్నికలు నిర్వహించాలి. ప్రభుత్వం వద్ద డబ్బులు లేవు. రైతులకు రుణాలు ఇవ్వడంలో న్యాయం చేయలేకపోయాం. పదవీ కాలంలో ప్రోటోకాల్ విషయంలో సరైన గౌరవం దక్కలేదు.

\- బొబ్బల అశోక్ రెడ్డి,
ఎఫ్ఏసీఎస్ చైర్మన్, పాలకుర్తి

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

నర్మెట: మండలకేంద్రంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న విగ్రహప్రతిష్ఠాపన ఉత్సవాలు అశేష భక్త జనసందోహం నడుమ గురువారం ఘనంగా ముగిసాయి. పురాణ వాచస్పతి, పరాశర సరస్వతి, భారతీ తీర్థ పుస్కార అవార్డు గ్రహీత బ్రహ్మశ్రీ పురాణం మహేశ్వర శర్మ పర్యవేక్షణలో అత్తినూరు పవన్ కుమార్ శర్మ సారథ్యంలో వేదపండితులు కార్యక్రమములను చేపట్టారు. ఆలయ కమిటీ చైర్మన్ గంగం నర్సింహారెడ్డి, కార్యదర్శి జంగిటి అంజయ్య, కమిటీ సభ్యులు, భజన మండలులు, భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కేంద్ర బడ్జెట్ పెట్టుబడిదారులకు అనుకూలం

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

జనగామ రూరల్: కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మికులకు వ్యతిరేకంగా, పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. గురువారం పట్టణంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు జోగు ప్రకాశ్ అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికులకు బడ్జెట్‌లో సరైన నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. బడ్జెట్‌ను వెంటనే సవరించాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్, రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, రాష్ట్ర కమిటీ సభ్యులు సోమన్న, సీఐ టీయూ జిల్లా అధ్యక, కార్యదర్శులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్/జనగామ రూరల్: దేశ వ్యాప్తంగా ప్రజలంతా బీజేపీ వైపు ఉన్నారని, బీజేపీతోనే అన్ని వర్గాల ప్రజలకు సమ న్యాయం జరుగుతుందని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి అన్నారు. వరంగల్, నల్గొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పార్టీ జిల్లా కార్యాలయం, ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం గల్లీ నుంచి ఢిల్లీ వరకు బీజేపీ విజయవిహారం చేస్తుందన్నారు. మోదీ చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పులి సరోత్తమ్‌రెడ్డిని గెలిపించేలా పార్టీ శ్రేణులు బాధ్యతగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశాల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్, నాయకులు విద్యాసాగర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు సట్ల వెంకటరమణ, నాయకులు బొజ్జపెల్లి సుభాష్, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, చిలుక విజయరావు, కె.శరత్‌కుమార్, శశిదర్‌రెడ్డి, ఉమరెడ్డి, ఉడుగుల రమేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్: మాట్లాడుతున్న ప్రేమేందర్‌రెడ్డి

సాధారణ రికవరీ కోసమే వెళ్లాం

- డీసీసీబీ బీఎం కల్యాణి

కొడకండ్ల: విధి నిర్వహణలో భాగంగా సాధారణ రుణ రికవరీలో భాగంగానే జేఎల్‌బీ గ్రూప్ రికవరీ కోసం ఏడునూతుల గ్రామానికి వెళ్లామని డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ ఎస్.కల్యాణి తెలిపారు. గురువారం బ్యాంక్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. అక్టోబర్ 2021న గ్రామానికి చెందిన పది మంది మహిళా సభ్యులతో జేఎల్‌బీ గ్రూప్‌కు రూ.8,72,000 రుణాన్ని ఇవ్వడం జరిగిందని, ఈ గ్రూప్‌లోని లబ్ధిదారైన మద్దెబోయిన ప్రేమలత రుణం చెల్లించకపోవడంతో అనేకమార్లు రుణాన్ని చెల్లించాలని కోరినట్లు తెలిపారు. బుధవారం మరోసారి రికవరీ కోసం వెళ్లి రుణం చెల్లించాలని కోరగా తమ పేరుతో వచ్చిన పాడి గేదెను వేరొకరు తీసుకుని రుణం చెల్లించడం లేదని తాము ఎలా చెల్లిస్తామని సంభాషణ జరుగుతున్న క్రమంలో మీరు తీసుకున్న రుణం సక్రమంగా చెల్లించకపోవడం వలన మా పరువు పోతుందని లబ్ధిదారు భర్త నర్సయ్య కోపంతో తన ఇంటి గేటును ట్రాక్టర్‌లో వేయడం జరిగిందని ఆమె తెలిపారు. రుణ రికవరీ కోసం తాము ఎవరిని ఇబ్బంది పెట్టలేదని, బ్యాంకుపై వస్తున్న ఆరోపణలు తప్పని ఆమె ఖండించారు. ఈ సమావేశంలో ఫీల్డ్ ఆఫీసర్ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కల్యాణి

మొక్కల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలి

రఘునాథపల్లి: నర్సరీ మొక్కల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు అన్నారు. గురువారం మండలంలోని నిడిగొండ నర్సరీని ఆయన పరిశీలించారు. నర్సరీలకు ఇచ్చిన టార్గెట్ ప్రకారం బెడ్లను ఏర్పాటు చేసి మొక్కల పెంపకం చేపట్టాలని సిబ్బందికి సూచించారు. నర్సరీతో పాటు హరితహారంలో భాగంగా నాటిన ప్రతి మొక్క సంరక్షణకు పాటుపడాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ అబ్బయ్య ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

బోర్లను మరమ్మతు చేయించండి

జనగామ: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడిని నివారించేందుకు నిరుపయోగంగా ఉన్న చేతి పంపులను రిపేరు చేయించాలని అమ్మ ఫౌండేషన్ తెలంగాణ వ్యవస్థాపకులు మంతెన మణికుమార్ కోరారు. గురువారం ఆయన జిల్లా కేంద్రంలో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాల్లో ప్రస్తుత పరిస్థితిని అంచనా వేసి, రాబోయే మూడు నెలల కాలంలో తాగునీటి ఎద్దడి ఉండబోయే గ్రామాలను గుర్తించి, ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని విన్నవించారు. జిల్లాలో చెరువులు, కుంటలు ఎండిపోతున్నా, గోదావరి జలాలతో నింపడంలో అలసత్వం చేస్తున్నారన్నారు. చేతిపంపుల రిపేరుతో పాటు పురపాలిక పరిధిలో ప్రతి వార్డుకు ట్రాక్టర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు.

విజయవంతం చేయాలి

కొడకండ్ల: ఈ నెల 15న సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ కోరారు. గురువారం మండలకేంద్రంలో సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ ఎన్నికలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధ్యక్షుడిగా భూక్య శ్రీనునాయక్, గౌరవ అధ్యక్షునిగా సురేష్‌నాయక్, సలహాదారుగా రాజేష్‌నాయక్, నరేందర్ పవార్, ఉపాధ్యక్షులుగా యాకు, కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా రాము, సమన్వయ కమిటీ సభ్యులుగా రాములు, రవీందర్, ప్రవీణ్, వీర్యానాయక్, వెంకన్న, రామ్‌కుమార్, సోమన్న, భీమాని, రమేష్, రవిందర్, హేమాని, శంకర్ ఎన్నికయ్యారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్‌ను పార్టీ అనుబంధ నాయీ బ్రాహ్మణ సమైక్య సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గజ్జెల్లి వెంకన్న, ప్రధాన కార్యదర్శి దేవరకొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కొలిపాక సతీష్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీను తదితరులు గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాయీబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యల్ని పీసీసీ అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

జిల్లాకు సర్వాయి పాపన్న పేరు పెట్టాలి

జనగామ రూరల్: కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు జనగామ జిల్లాకు సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెట్టాలని గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా పర్యాటనకు వచ్చిన ఎమ్మెల్సీ కవితకు వినతిపత్రం అందజేశారు. ఈశ్వరయ్య, మానస, కీర్తి లత, సంపత్ , బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

బచ్చన్నపేట: మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన పేర్ని లక్ష్మి–వెంకటయ్య దంపతుల కూతురు సహస్ర వివాహానికి సామాజిక సేవాకర్త కోడూరి శివకుమార్‌గౌడ్ రూ.5 వేల ఆర్థికసాయం గురువారం అందజేశారు. చంద్రయ్య, రాములు, నాగయ్య, ప్రవీణ్, వెంకటేశం, రాజయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి...

చిన్నరామన్‌చర్ల గ్రామానికి చెందిన గందమల్ల నర్సయ్య మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రటరీ పిన్నింటి కావ్యశ్రీరెడ్డి రూ.4 వేల సాయం గురువారం అందజేశారు. బాపురెడ్డి, నారాయణరెడ్డి, రమేష్, కరుణాకర్‌రెడ్డి ఉన్నారు.

ఆంగ్లభాషలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

- మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీధర్

రఘునాథపల్లి: ఆంగ్ల భాషలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మండలంలోని వెల్ది మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పాలకుర్తి శ్రీధర్ అన్నారు. గురువారం మోడల్ స్కూల్‌లో ఆంగ్ల భాషాదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంగ్ల విభాగాధిపతి గణేష్ కందగట్ల అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆంగ్ల భాషపై శ్రద్ధ కనబరిస్తే ప్రపంచవ్యాప్తంగా ఎన్నో అవకాశాలు అందిపుచ్చుకోవచ్చన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, గేయ రచన, ఉపన్యాస, పోస్టర్ మేకింగ్ విభాగాల పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు విజయ, సురేష్ ఉన్నారు.

కూనూర్ పాఠశాలలో..

జఫర్‌గఢ్: కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల భాషాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆంగ్ల ఉపాధ్యాయులు రమేష్‌బాబు, రాంబాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి ప్రతిభకనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు రాథోడ్, సాయికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



రఘునాథపల్లి: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీధర్

వావిలాలలో..

పాలకుర్తి టౌన్: ఆంగ్ల కవి సరోజిని నాయుడు జయంతి పురస్కరించుకుని మండలంలోనివావిలాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఇంగ్లిష్‌లో వ్యాస రచన, వక్తృత్వ, స్టోరీ, టెలిగ్,పోస్టర్ తయారి, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ పోతుగంటి నర్సయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఆంగ్లంలో మాట్లాడడం, చదవడం అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏఏపీసీ చైర్ పర్సన్ కొనకటి రాణి, ఆంగ్ల ఉపాధ్యాయుడు అజ్మీరా సోమాని నాయక్, వరప్రసాద్, బాలాజీ, కొండయ్య, జసింతరాణి, జ్ఞానకుమారి, సుగుణాదేవి, మంజుల, కవిత పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

నర్మెట/బచ్చన్నపేట: నర్మెట మండలంలోని వెల్దండకు చెందిన తుమ్మ సంపత్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయల పాలయ్యాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ కుమార్ బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన చికిత్స నిమిత్తం రూ. 1.25 లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేశారు. కాగా, ఎల్‌ఓసీని గురువారం బాధిత కుటుంబానికి కిరణ్ కుమార్ అందజేశారు. అలాగే బచ్చన్నపేట మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన బడేకోల్ రమేశ్‌రెడ్డి అనారోగ్యంతో బాధపతున్న విషయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి కిరణ్‌కుమార్ తీసుకెళ్లాడు. చికిత్స నిమిత్తం మంజూరైన రూ.2లక్షల ఎల్‌ఓసీని బాధిత కుటుంబానికి అందజేశారు.

పరామర్శ

పాలకుర్తి: మండలంలోని చెన్నూరుకు చెందిన జోగు అశోక్ గొర్రెలు 30 మృతి చెందాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి గ్రామానికి చేరుకుని బాధితుడిని పరామర్శించి అతడికి సాయం అందేలా చూడాలని అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత

చిల్పూరు: రోడ్డు భద్రత అందరి బాధ్యత అని ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ అన్నారు. మండలంలోని వంగాలపల్లి–కరుణాపురం బస్‌స్టేజీల సమీపంలోని జాతీయ రహదారిలో గురువారం ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. ఏఎస్సై జయకుమార్, సిబ్బంది చారి, వీరన్న, మేకల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై

'స్థానిక' ఎన్నికలకు సహకరించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయశ్రీ

స్టేషన్‌ఘన్‌పూర్: త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ విజయశ్రీ అన్నారు. ఘన్‌పూర్ మండల పరిషత్ కార్యాలయంలో అఖిల పక్ష పార్టీల నాయకులతో ఎంపీడీఓ గురువారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని, అందరూ ఎన్నికల నిబంధనల్ని పాటిస్తూ పోలింగ్ సజావుగా జరిగేలా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు శిరీష్‌రెడ్డి, రమణగౌడ్, మాచర్ల గణేష్, జీడి రమేష్, గాదె పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ సమీపంలో రైతు ఆత్మహత్యాయత్నం

- భూవివాదం నేపథ్యంలో..
- పోలీసుల వేధింపులే కారణమని కుటుంబికుల ఆరోపణ



చికిత్స పొందుతున్న సోమన్న

రఘునాథపల్లి: భూవివాదంలో బాధితుడినైన తనతోపాటు తన కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి పోలీసులు వేధిస్తున్నారంటూ ఓరైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. మండలంలోని మంగళిబండ తండా శివారు దుబ్బతండాకు చెందిన గుగులోతు సోమన్న రెండేళ్ల క్రితం ఎకరం భూమి అమ్మేందుకు దాయాదులకు చెందిన నర్సింహను సంప్రదించాడు. రూ.14.50లక్షల ధర నిర్ణయించారు. ఈక్రమంలో అదే తండాకు చెందిన తోట శ్రీను రూ.20 లక్షలకు కొంటానని ఫోన్ చేసి చెప్పాడు. దీంతో సోమన్న తన భూమిని నర్సింహకు అమ్మనని చెప్పాడు. ఆ తర్వాత శ్రీను మూడు దఫాలుగా సోమన్నకు రూ.3 లక్షలు అప్పజెప్పాడు. సదరు భూమి రికార్డుల్లో సీలింగ్ భూమిగా చూపడంతో శ్రీను మిగతా డబ్బులు ఇవ్వకుండానే భూమిని సాగు చేస్తున్నాడు. కాగా, రూ.9 లక్షలు ఇచ్చానని శ్రీను అంటుండగా.. తనకు రూ.3 లక్షలు మాత్రమే ఇచ్చాడని సోమన్న చెబుతున్నాడు. ఈక్రమంలో ఇద్దరి మధ్య గొడవ జరిగి పోలీసులను ఆశ్రయించారు. డబ్బులివ్వకుండా భూమి కాస్తు చేస్తున్న వ్యక్తిని వదిలి తాను తన భార్య ఝాన్సీ, తల్లి బుజ్జమ్మలపై కేసు నమోదు చేసి పోలీసులు బెదిరిస్తున్నారని సోమన్న మనస్తాపం చెందాడు. ఈక్రమంలో బుధవారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన సోమన్న పక్కనే తహసీల్దార్ కార్యాలయం వద్ద పురుగుల మందు తాగాడు. పోలీసులు గుర్తించి జనగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. దీనిపై ఎస్సై స్పందిస్తూ ఇరువురు పలుమార్లు గొడవ పడి వస్తే.. భూ తగాదా కావడంతో జోక్యం చేసుకోలేదని తెలిపారు. సోమన్నతోపాటు అతడి భార్య, తల్లి.. పైపులు ధ్వంసం చేశారనే శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సోమన్న పోలీస్‌స్టేషన్ సమీపంలో పురుగుల మందు డబ్బాతో హల్‌చల్ చేసి వెళ్లాడని, తాము ఎలాంటి వేధింపులకూ పాల్పడలేదని ఎస్సై తెలిపారు.





సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కె. మల్లేశ్ (S.R) : 9849921793 (జనగామ)
ఎన్. అనిల్ (S.R) : 9949363827 (పాలకుర్తి)
ఎల్. అనిల్ (S.R) : 8074977328 (స్టే॥ ఘన్‌పూర్)